Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 165 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 5 - 2 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## మోదీ ప్రసంగానికి ముందే లోక్‌సభ వాయిదా




**న్యూఢిల్లీ:** విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య లోక్‌సభ రేపటికి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవా దాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రసంగించాల్సి ఉంది. అయితే మోదీ ప్రసంగానికి ముందే సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు.

**మూడుసార్లు వాయిదా**

బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో అధి కార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండటంతో సభ బుధవారంనాడు మూడు సార్లు వాయిదా పడింది. తొలుత సభ ప్రారంభ కాగానే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ జరపాలంటూ విపక్ష సభ్యులు పట్టుబట్టడంతో గందరగోళ పరిస్థితుల మధ్య మధ్యాహ్నం 12 గంటల వరకూ లోక్‌సభ వాయిదా పడింది. దీంతో విపక్ష సభ్యులు పార్లమెంటు మెట్ల వద్ద ప్లకార్డులతో నిరసనకు దిగారు. మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే మళ్లీ గందరగోళం తలెత్తింది. దీంతో మధ్యాహ్నం 2 గంటలకు సభలో సమాధా నం ఇస్తానని కేంద్ర మంత్రి పీయూష్ గెయల్ చెప్పడంతో సభ రెండోసారి వాయిదా పడింది. తిరిగి 2 గంటలకు సభ ప్రారంభం కాగానే పీయూష్ గోయల్ మాట్లాడుతుండగా.. 8 మంది ఎంపీలను సమావేశాల నుంచి బహిష్కరించడంపై స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో సాయంత్రం 5 గంటలకు సభ వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. తిరిగి సభ ప్రారంభమై మోదీ ప్రసంగించాల్సి ఉండగా దీనికి ముందే స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు.

## సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ సమావేశం.. కీలక అంశాలపై చర్చ

**అమరావతి, (రాజధాని వార్తలు):** సీఎం చంద్రబాబు నాయుడితో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. బుధవారం ఉదయం సీఎం నివాసానికి చేరుకున్నారు పవన్. అనంతరం ఇద్దరి మధ్య సమావేశం మొదలైంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, సున్నితమైన అంశాలపై విపక్షం రెచ్చగొట్టే ప్రయాత్నాలు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికలు, నియామక పదవులు, కూటమి పక్షాల సమన్వయం, వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టడంపై చర్చించనున్నట్లు సమాచారం. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నట్లు తెలుస్తోంది. తిరుమలకు ప్రపంచ వ్యాప్తంగా భక్తులు ఉన్న నేపథ్యంలో.. వారి మనోభావాలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే గతంలో సీఎం మాట్లాడటం, విచారణకు ఆదేశించడం, అలాగే ఈ అంశంపై సుప్రీం కోర్టుకు పలువురు వెళ్లగా సీబీఐ నేతృత్వంలో సిట్ ఏర్పాటై ఈ వ్యవహారంపై విచారించడం జరిగింది. సిట్ తన నివేదికను



కేబినెట్ ముందు ఉంచగా నిన్న (మంగళవారం) ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. నెయ్యి కల్తీ జరగడం వాస్తవమని తేలడంతో.. ఇందులో ఎవరు సూత్రధారులు అనేదానిపై కేబినెట్‌లో చర్చించడంతో పాటూ కల్తీకి ఆస్కారం ఇచ్చిన వారంతా బాధ్యులే అని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం.

## ఖతార్ రాజధాని దోహాలో మంత్రి నారాయణ బృందం పర్యటన

### - దోహా స్పోర్ట్స్ సిటీని సందర్శించిన మంత్రి బృందం





**ఖతార్/దోహా :** స్పోర్ట్స్ సిటీలోని ఖలీఫా ఇంటర్నేషనల్ స్టేడియం, ఆస్పిటర్ స్పోర్ట్స్ హాస్పిటల్, ఆస్పైర్ అకాడమీని అధ్యయనం చేసిన మంత్రి నారాయణ. వివిధ రకాల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లతో అంతర్జాతీయ క్రీడలకు గమ్యస్థానంగా ఉన్న దోహా స్పోర్ట్స్ సిటీ. 250 హెక్టార్లలో భారీ విస్తీర్ణంలో ఉన్న స్పోర్ట్స్ సిటీలో 2006లో ఆసియన్ గేమ్స్ నిర్వహణ. ఆసియాలోనే మొదటి స్పోర్ట్స్ మెడిసిన్ హాస్పిటల్‌గా ఉన్న ఆస్పిటర్ స్పోర్ట్స్ హాస్పిటల్. అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికల గురించి దోహా అధికారులతో చర్చించిన మంత్రి నారాయణ. మంత్రి నారాయణ వెంట దోహా పర్యటనలో ఉన్న మున్సిపల్



శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, అమరావతి గ్రోత్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్.

## సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి, (రాజధాని వార్తలు):** సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష. హాజరైన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, ఆ శాఖ ఉన్నతాధికారులు. రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల నిర్మాణంతో పాటు సురక్షిత తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసే అంశంపై సీఎం దిశానిర్దేశం. రూ.60 కోట్ల సాస్కి నిధులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశం. 814 హాస్టళ్లలో రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని తెలిపిన అధికారులు. హాస్టళ్లలో శానిటేషన్, ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించిన ముఖ్యమంత్రి. హెల్త్, ఎడ్యుకేషన్ సహా అన్ని రంగాల్లోనూ బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలని సూచనలు జారీ. విద్యార్థుల విద్యాపరమైన అంశాల పర్యవేక్షణకు ఆపార్ ఐడీలను నమోదు చేసి లింక్ చేయాలని ఆదేశించిన సీఎం.

## 2026-27 ఏపీ బడ్జెట్.. పయ్యావుల కీలక చర్చలు.. వాటిపైనే స్పెషల్ ఫోకస్




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈనెల 14వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ కసరత్తులో భాగంగా ఆర్థిక మంత్రి వరుసగా ప్రీ-బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు శాఖలకు చెందిన మంత్రులతో సమావేశాలు పూర్తయ్యాయి. మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, అనితలతో వరుస సమావేశాలు జరిపారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖలకు నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. వివిధ శాఖల మంత్రులు తమ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి సమర్పించారు. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర- రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బడ్జెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. రోడ్ల అభివృద్ధిపైనా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పాత హోల్స్ రోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. హార్టికల్చర్ రంగ అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు, లాజిస్టిక్స్ సెక్టార్ వృద్ధిపై సర్కార్ ప్రత్యేక ఫోకస్ పెట్టనుంది. అంతేకాకుండా, జల్ జీవన్ మిషన్ పథకాన్ని వేగవం తం చేసేందుకు తగిన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం (ఫిబ్రవరి 3) చర్చలు జరిపారు. అలాగే మిగిలిన శాఖల మంత్రులతోనూ త్వరలో సమావేశాలు జరిగే అవకాశం ఉంది.

## ముడి పొగాకు ఉత్పత్తులపై సున్నా ఎక్సైజ్ సుంకం హర్షణీయం

### - పొగాకు రైతులకు, చిరు వ్యాపారులకు పెద్ద ఊరట - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, (రాజధాని వార్తలు):** బ్రాండ్ లేని ముడి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని సున్నా శాతానికి తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాగతిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని పొగాకు రైతులు, చిరువ్యాపారులకు ప్రత్యక్షంగా లాభం చేకూరుస్తుందని పేర్కొన్నారు. పొగాకు సూ కోడ్ 2401 కిందకు వచ్చే, రీటైల్ విక్రయాల కోసం ప్యాక్ చేయని అన్ బ్రాండెడ్ ముడి పొగాకుపై ఇకపై ఎలాంటి ఎక్సైజ్ డ్యూటీ వర్తించదని తెలిపారు. గతంలో అస్పష్టమైన నిబంధనల వల్ల రైతులు, వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ గెజిట్‌తో తొలగిపోతాయని చెప్పారు. అయితే బ్రాండెడ్‌గా ప్యాక్ చేసిన పొగాకు ఉత్పత్తులపై 18 శాతం ఎక్సైజ్ సుంకం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో పన్నుల విషయంలో స్పష్టత, పారదర్శకత పెరుగుతాయని, రైతులకు మెరుగైన ధర లభించే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మార్పులతో ముడి పొగాకు సరఫరా వ్యవస్థకు ఉపశమనం లభిస్తుందని, ప్రభుత్వ ఆదాయానికి ఎలాంటి భంగం కలగదని మంత్రి స్పష్టం చేశారు. గతంలో ప్యాకింగ్, రీటైల్ విక్రయాలపై పన్ను వర్తింపుపై ఉన్న సందేహాలు ప్రస్తుత గెజిట్‌తో



పూర్తిగా తొలగిపోయాయని మంత్రి తెలిపారు. బల్క్ ముడి పొగాకుపై ఎలాంటి పన్ను లేకపోవడం వల్ల రైతులకు నేరుగా లాభం చేకూరుతుందని, మెరుగైన ధర లభించే అవకాశం ఉందన్నారు. అలాగే బ్రాండెడ్ ఉత్పత్తుల పేరుతో జరిగే దుర్వినియోగానికి ఈ కొత్త మార్గదర్శకాలు అడ్డుకట్ట వేస్తాయని మంత్రి పేర్కొన్నారు.

## ప్రతిభ అవార్డ్ అందుకున్న ఎస్ఐ సురేష్‌ను సన్మానించిన హనుమాన్ జంక్షన్ ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్




**హనుమాన్ జంక్షన్, (రాజధాని వార్తలు):** హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వచ్చిన కొద్దికాలంలోనే వెలుగుల సురేష్ మంచి పేరు తెచ్చుకున్నారని అందుకే ఆయన్ను ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని హనుమాన్ జంక్షన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చక్రపాణి విజయ్ కుమార్ అన్నారు. హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ వెలుగుల సురేష్ విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో జిల్లా ఎస్పి విద్యాసాగర్ నాయుడు, జిల్లా కలెక్టర్ బాలాజీ చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హనుమాన్ జంక్షన్ ఫోటో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెలుగుల సురేష్ ను బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ తాడి రంగారావు మాట్లాడుతూ ఉన్నతమైన విలువలతో పోలీస్ డిపార్ట్మెంట్ పనిచేస్తున్న సురేష్ బావితరాలకు మార్గదర్శకులు కావాలని అన్నారు, ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్‌ను సన్మానించారు. చిరకాలం గుర్తుంచుకునే విధంగా అతి విలువైన జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ట్రెజరర్ గంటా శ్రీనివాసరావు, సీనియర్ ఫోటో గ్రాఫర్స్ అంబళ్ళ వెంకట రంగారావు,మోగంటి వెశికటేశ్వరరావు (కొండ) కళ్ళేపల్లి నారాయణరావు, వేల్పూరి రంగబాబు, తవ్వా సురేష్, కర్ణికోట చిన్న, కోలపల్లి మల్లేశ్వరరావు, నోచర్ల అంజనీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సత్య కళాశాలలో ఆప్టిట్యూడ్, రీజనింగ్ తరగతులు ప్రారంభోత్సవం







**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC) సహకారంతో కళాశాలలో 15 రోజులపాటు నిర్వహించనున్న ఆప్టిట్యూడ్ మరియు రీజనింగ్ శిక్షణ తరగతులు నేడు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి మరియు సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ఆంధప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ తరుణ్ కుమార్ పట్నాయక్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ఆప్టిట్యూడ్ మరియు రీజనింగ్ మరియు అంశాలపై పట్టు అత్యంత అవసరమని అన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయని, భవిష్యత్తులో ప్రభుత్వ మరియు ప్రైవేట్‌రంగ ఉద్యోగాలకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల సంచాలకులు మాట్లాడుతూ, APSSDC వంటి రాష్ట్రస్థాయి సంస్థతో కలిసి ఈ శిక్షణను నిర్వహించడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్యోగోన్ముఖులుగా తీర్చిదిద్దడమే కళాశాల ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే ఈ 15 రోజుల ఆప్టిట్యూడ్ మరియు రీజనింగ్ తరగతులు ప్రారంభించామని తెలిపారు. శిక్షణ సమయంలో క్రమశిక్షణతో పాల్గొని, ప్రతి అంశాన్ని లోతుగా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్ర మానికి అనుభవజ్ఞులైన శిక్షకుడు జి.రాజు శిక్షణ అందించనున్నారు. ఆయన తన ప్రసంగంలో, సరైన పద్ధతిలో సాధన చేస్తే ఆప్టిట్యూడ్ మరియు రీజనింగ్ చాలా సులభమైనవని, రోజువారీ ప్రాక్టీస్ ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసరులు కెప్టెన్ ఎం సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్ అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# కార్మిక హక్కులను కాపాడుకునేందుకే సార్వత్రిక సమ్మె

## - సిఐటియు జిల్లా నాయకులు ఎంబీ నర్సారెడ్డి
## - సార్వత్రిక సమ్మె విజయవంతానికై విస్తృత ప్రచారం



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను బలిదానం చేసి సాధించుకున్న హక్కులను పరిరక్షించుకునేందుకే ఈ నెల 12వ తారీకున యావత్ కార్మికులోకం సార్వత్రిక సమ్మెకు దిగుతుందని ఈ సార్వత్రిక సమ్మె విజయవంతంతో మోడీ సర్కార్ దిగి రాక తప్పదని సిఐటియు జిల్లా నాయకులు ఎంబీ నర్సారెడ్డి అన్నారు. ఈనెల 12వ తారీకున జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణ వ్యాప్తంగా సిఐటియు బృందం విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం జిసిసి కార్మికుల ఉద్దేశించి ఎంపీ నర్సారెడ్డి మాట్లాడుతూ కార్మికుల చట్టాల స్థానంలో మోడీ సర్కార్ కోడ్లను తీసుకు వచ్చి కార్మికులకు తీవ్రమైన ద్రోహాన్ని తలపెట్టారని ఆరోపించారు. కనీస పనికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని అదేవిధంగా పని భద్రత కల్పించాలని కార్మికులు స్వచ్ఛందంగా యూనియన్లు పెట్టుకునే చట్టాన్ని కొనసాగించాలని తదితర డిమాండ్లతో జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ జెండాలను పక్కనపెట్టి ఒక్కటే ఎజెండాగా కదిలి రావాలని కోరారు. నూతన కోళ్ళతో ఇప్పటికే పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్లో 12 గంటల పని విధానాన్ని కొనసాగించే ప్రయత్నాలు ప్రారంభమైనవని తెలంగాణలో కూడా కొన్ని పరిశ్రమలలో 12 గంటల పని విధానాన్ని తీసుకు వచ్చే కుట్రలు ప్రారంభించారని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పనికి తగ్గ వేతనం ఇవ్వకపోగా పని గంటలు పెంచే మోడీ విధానాలు మోడీ విధానాలకు వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను కార్మికులు గుర్తించాలని కోరారు. ఈనెల 12 వ తారీఖున సార్వత్రిక సమ్మెతో కార్మికుల ఐక్యత చాటి చెప్పాలని ప్రతి కార్మికుడు సమ్మెలో పాల్గొనటమే కాకుండా భద్రాచలం పట్టణంలో జరిగే మహా ప్రదర్శనలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిసిసి హమాలి నాయకులు సుబ్రహ్మణ్యం శ్రీనివాస్ ప్రసాదు ముక్తేశ్వరరావు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఆదర్శనగర్‌లో నివసిస్తున్న గృహిణి అదృశ్యం

**తగరపువలస, (రాజధాని వార్తలు):** తన తల్లి కనబడటం లేదని కుమారుడు పోలీసులకు పిర్యాదు చేసాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తగరపువలస ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్న కొల్లి ఆదిలక్ష్మి (49) ఈ నెల 2వ తేదీ సోమవారం ఉదయం ఇంటి నుండి వెళ్ళిపోయి రాకపోవడంతో ఆమె కుమారుడు కొల్లి కిరణ్ పోలీసులకు పిర్యాదు చేసాడు. గతంలో భర్తతో ఏర్పడిన చిన్న చిన్న గొడవల కారణంగా ఆమె పలుసార్లు ఇంటి నుండి వెళ్ళిపోయి సాయంత్రం తిరిగి వచ్చేదని, కానీ ఈసారి ఎటువంటి గొడవలు లేకుండానే ఇంటి నుండి వెళ్ళిపోయిందని, అయితే ఇటీవల కాలంలో ఆమె మానసిక పరిస్థితి బాగోలేక మందులు వాడుతుందని తెలియచేసారు. ఎంత వెదికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పిర్యాదు చేయడం జరిగిందని, పిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియచేసారు.

# భక్తులతో కిటకిటలాడిన శంబర మారు జాతర





**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలం శంబర గ్రామంలో వేంచేసి ఉన్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు భక్తుల కొంగుబంగారం కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అయినటువంటి శ్రీశ్రీ శంబర పోలమాంబ అమ్మవారి మారు జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుమారు లక్షమంది భక్తులు ఈరోజు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ నైదాన చిన్న తిరుపతి మరియు బోర్డ్ మెంబర్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తగిన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. జాతర ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాలూరు సిఐ రామకృష్ణ మక్కువ ఎస్ఐ ఎం వెంకటరమణ సిబ్బందితో తగిన బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకున్న పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయచంద్ర. భక్తులు తమ తమ కోర్కెలు తీరేలా అమ్మవారిని మొక్కుకొని మొక్కులు చెల్లించారు. ప్రయాణికులకు సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపారు.

# ఆంధ్రాలోని గుండాల ఇసుక తెలంగాణకు తరలింపు

## - జనసేన పార్టీ ఎటపాక మండల అధ్యక్షులు మారాసు గంగాధర్



**ఎటపాక, (రాజధాని వార్తలు):** ఎటపాక మండలం గుండాల గ్రామంలో ఇసుక ర్యాంప్ నుంచి అధికారికంగా ఇసుకను కొనుగోలు చేసి అక్రమార్కులు ఎటపాక మండలం శివారు ప్రాంతంలో పగలు డంపు చేసుకుని రాత్రి వేళలో పక్క రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భద్రాచలంకు అక్రమార్కులు ఇసుకను తరలించి అక్రమ సంపాదన అర్జిస్తున్నారు అని జనసేన పార్టీ ఎటపాక మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ ఈరోజు ఎటపాక మండల తాసిల్దార్ శ్రీనివాస్‌కు రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి సందీప్‌లకు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విక్రమార్కులకు అడ్డుకట్ట వేయాలని దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకు రావాలని ఎవరు చూసిన వారు ఎంతటి వారైనా సరే సహించేది లేదని గతంలో అక్రమంగా ఇసుక తరలించిన వారిని బ్లాక్లిస్టులో పెట్టడం జరిగిందని మరొకసారి ఎవరైనా పట్టుబడితే శాశ్వతంగా బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆ బళ్లను సీజ్ చేయాలని అక్రమార్కులపై చట్టపరమైన కేసులు పెట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి గోడేటి నాగరాజు పాల్గొనడం జరిగింది.

# వైసీపీ జిల్లా యువజన విభాగం కార్యవర్గ సభ్యునిగా తోట వాసు నియామకం

## - జెడ్ చైర్‌పర్సన్ చిన్న శ్రీనుకి, సిరమ్మకు కృతజ్ఞతలు తెలిపిన తోట వాసు



**విజయనగరం, (రాజధాని వార్తలు):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా, పార్టీ కేంద్ర కమిటీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయ కర్త గౌ. మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), జిల్లా యువజన విభాగం కార్యవర్గ సభ్యునిగా తోట వాసును నియమించారు.

**చిన్న శ్రీనుకి, సిరమ్మకు కృతజ్ఞతలు**

ఈ నియామకంపై తోట వాసు స్పందిస్తూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కి మరియు తన ఎదుగుదలకు నిరంతరం ప్రోత్సాహాన్ని అందిస్తున్న చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**మర్యాదపూర్వక కలయిక సత్కారం**

మంగళవారం ధర్మపురిలోని నివాసంలో మజ్జి శ్రీనివాసరావును, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు అల్లు అవినాష్‌తో కలిసి తోట వాసు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూల బొకే అందజేసి కృతజ్ఞత పూర్వకంగా సత్కరించారు. అదేవిధంగా, పార్టీ బాధ్యతల్లో తనను ప్రోత్సహించినందుకు సిరమ్మని కూడా అల్లు అవినాష్ మరియు యువజన విభాగం కార్యకర్తలు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా తోట వాసు పేర్కొన్నారు.

# పద్మనాభం మండల పార్టీ కార్యాలయంలో కమిటీల నియామకాన్ని పరిశీలించిన సిరమ్మ



**పద్మనాభం, (రాజధాని వార్తలు):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పద్మనాభం మండల వైఎస్సార్సీపీ కార్యాలయంలో పార్టీ గ్రామస్థాయి కమిటీల నియామకం మరియు డిజిటలైజేషన్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె, 'చిన్న శ్రీను సోల్జర్స్' అధ్యక్షురాలు సిరి సహస్ర (సిరమ్మ) హాజరై డిజిటలైజేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిరమ్మ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు కీలకమని, ప్రతి కార్యకర్త వివరాలను డిజిటలైజ్ చేయడం ద్వారా పార్టీ యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల ఎంపీపీ కంటుభుక్త రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు 'చిన్న శ్రీను సోల్జర్స్' పాల్గొన్నారు.

# 18 నుండి బాల రాముని విగ్రహా ప్రతిష్ట మహోత్సవం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** తెలుగు రాష్ట్రాల్లో ప్రప్రథ మంగా శ్రీ అయోధ్య బాలక్ రామమందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 18 నుంచి 20వ తేదీ వరకు బాల రాముని విగ్రహా ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నామని శ్రీ అయోధ్య బాలక్ రామ మందిర్ ట్రస్ట్ అధ్యక్షులు కుసుమంచి సుబ్బారావు పేర్కొ న్నారు. ఈరోజు ఉదయం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 18వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రతిష్ట సంకల్పం ప్రారంభమవుతుందని సాయంత్రం నాలుగు గంటల నుంచి శ్రీ గణేశ శ్రీ సరస్వతి సహిత శ్రీ శ్రీ అయోధ్య బాలక్ శ్రీరామ విగ్రహాలు శోభాయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. 20వ తేదీ ఉదయం 10 గంటల 34 నిమిషాలకు విగ్రహా ప్రతిష్ట జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు

# పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసిన జెసి సేదు మాధవన్





**గుర్ల, (విజయనగరం), (రాజధాని వార్తలు):** మండలంలోని పలు గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ మంగళవారం పర్యటించారు. ఆయన ముందుగా గరికవలస గ్రామాన్ని సందర్శించారు. అక్కడి రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. తప్పులు లేని పాసు పుస్తకాలను పంపిణీ చేయాలని, ఎటువంటి లోటుపాట్లు ఉన్నా సరిదిద్దాలని జెసి ఆదేశించారు.

**రేషన్ డిపో తనిఖీ**

మండలంలోని గరికివలస రేషన్ డిపో నెం.221045ను జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలోని స్టాకును, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన సరుకులను సకాలంలో అందజేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మండల తాహసీల్దార్ ఆదిలక్ష్మి, సిఎస్‌డిటిలు, ఆర్‌ఎస్డిటిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చెరకు రైతును ఆదుకుంటాం : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, (రాజధాని వార్తలు):** చెరకు రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం అన్నివిధాలా కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన అన్నిరకాల చర్యలను తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలో చెరకు రైతులు పరిస్థితి, సాగు, క్రషింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన మంగళవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా చెరకు రైతులు నష్టపోకుండా చూడాలని, దీనికోసం జిల్లాలోని సంకిలిలో ఉన్న ఎకైక చక్కెర కర్మాగారం ప్యారీ పరిశ్రమ మూతబడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమ మనుగడకు అనుగుణంగా చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. వరి పంట స్థానంలో ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దీనిలో భాగంగా చెరకు రైతుకు అన్నివిధాలా తగిన ప్రోత్సాహాన్ని అందిస్తామని అన్నారు. చెరకు వేసేందుకు ఇదే తగిన సమయమని, వచ్చే ఏడాది నాటికి జిల్లాలో గణనీయంగా చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి ప్రణాళికను సిద్దం చేయాలని మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో చెరకు విస్తీర్ణాన్ని పెంచేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు. జిల్లాలో ఉద్యాన మిషన్ ద్వారా అదనంగా పదివేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగును పెంచేందుకు కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా చెరకు పంటను ప్రోత్సహిస్తామని చెప్పారు.



చెరకు రైతు సంక్షేమం, సంకిలి ఫ్యాక్టరీ మనుగడను దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికను రూపొందించి, మూడు జిల్లాల్లో అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. దీనికోసం ప్రస్తుతం చెరకు సాగులో ఉన్న విస్తీర్ణంపై వ్యవసాయాధికారులతో వారం రోజుల్లో సర్వే చేయిస్తామని కలెక్టర్ చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కేన్ కమిషనర్ వి.వెంకటరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్, డిప్యూటీ కేన్ కమిషనర్ ఎం.సత్యనారాయణ, ప్యారీ కంపెనీ యూనిట్ హెడ్ బాలాజీ, వ్యవసాయ, చెరకు అధికారులు పాల్గొన్నారు.


# ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఇసుక అక్రమ రవాణా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గజపతినగరం సబ్ ఇన్స్పెక్టర్ కే.కిరణ్ కుమార్ నాయుడు హెచ్చరించారు. మండలంలోని రెండు వేరువేరు ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందని ఆయన విలేకరులకు తెలియజేశారు. ఎన్జీఆర్ పురం గ్రామానికి చెందిన ఎడదల గణపతి అనే వ్యక్తిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌తో తానే స్వయంగా అదుపులోకి తీసుకున్నానని, అదేవిధంగా మండలంలోని కె ఎస్ ఆర్ పురం గ్రామానికి చెందిన మీసాల లక్ష్మినాయుడు అనే వ్యక్తిని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను, డ్రైవర్లను మండల తహసిల్దార్ ఎదుట హాజరుపరచగా తహసీల్దార్ ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున జరిమానా విధించడం జరిగిందని ఎస్. ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. ఇసుక అక్రమ రవాణా చేసిన, అక్రమంగా అమ్మిన అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు హెచ్చరించారు.

# నిర్ణీత గడువులోగా ప్రాజెక్టుల భూసేకరణ పూర్తి చెయ్యండి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి







**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తారకరామ తీర్ధసాగర్, తోటపల్లి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, మూడో రైల్వే లైన్, కొత్తవలస-విజయనగరం నాలుగో రైల్వేలైన్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షించారు. ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రతీ ప్రాజెక్టుకు భూసేకరణ దశలను పూర్తి చేయడానికి నిర్ణీత గడువు విధించారు. అలాగే భోగాపురం ఎయిర్ పోర్ట్ రహదారి, ఎస్టీపీలు, ఎంఎస్ఎంఈ పార్కులకు భూ సేకరణ, మామహామాయ పరిశ్రమ విస్తరణ తదితర అంశాలపైనా ఆరా తీశారు. వీటన్నిటికీ భూసేకరణ త్వరగా పూర్తి చేసి, సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్, డిఆర్‌ఓ ఇ.మురళి, ఆర్‌డిఓలు డి.కీర్తి, రామ్మోహన్, ఎస్‌డిసిలు కళావతి, ప్రమీలాగాంధి, ఆర్ అండ్ బిఎస్‌ఈ కాంతిమతి, పరిశ్రమలశాఖ జిఎం కరుణాకర్, ఇరిగేషన్, జాతీయ రహదారులు, రైల్వే అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ఎల్‌ఏ యూనిట్ల డిటిలు పాల్గొన్నారు.

# ఛలో పోతిరెడ్డిపాడుకి సిద్ధం కండి - కాకాణి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతులకు, ప్రజలకు, సాగు, త్రాగునీరు రాకుండా చేస్తున్న అన్యాయానికి వ్యతిరేకంగా ఈ నెల ఫిబ్రవరి 5 తారీకు చేపట్టిన "చలో పోతిరెడ్డిపాడు" కార్యక్రమానికి సంబంధించి నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి మరియు వైఎస్ఆర్ సీపీ నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి వర్యులు మరియు వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, రైతులకు, ప్రజలకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా, రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధన కొరకు ఫిబ్రవరి 5వ తేదీన (గురువారం) ఉదయం 10:00 గం.లకు నంద్యాల జిల్లా, నందికొట్కూరు నియోజకవర్గం లోని పోతిరెడ్డి పాడు గ్రామం వద్ద సమావేశం నిర్వహించి రాయలసీమ, నెల్లూరు ప్రాంతాలకు జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర ప్రజలకు వివరిస్తాం - కాకాణి. కుటుమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ నెల్లూరు ప్రకాశం జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం చేశారు-కాకాణి. గత ప్రభుత్వంలో ముఖ్య మంత్రిగా పనిచేసిన జగన్ మోహన్ రెడ్డి కృష్ణా జలాలను సాగు నీరు, త్రాగునీరు అవసరాల కొరకు 3,825 కోట్ల రూపాయలతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కార్యక్రమం ప్రారంభించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జరుగుతున్న క్రమంలో జగన్మోహన్ రెడ్డికి మంచి పేరు రాకుండా చెయ్యాలని, ప్రతి పక్షంలో ఉన్న చంద్రబాబు, తెలంగాణలో టిడిపి నాయకుల చేత కోర్టులో కేసు వేయించి, అనేక రకాల ఇబ్బందులకు గురి చేసినా లెక్క చెయ్యకుండా పనులు కొనసాగించాడు. నెల్లూరు జిల్లా రైతులకు జీవనాడి, వర ప్రదాయని లాంటి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చంద్రబాబు నిర్వీర్యం చేశాడు. చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే తాను చెప్పిన మీదట రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపివేశాడంటూ రేవంత్ రెడ్డి, తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా మాట్లాడాడు. జగన్మోహన్ రెడ్డి మేము, రైతులు అనేక సందర్భాల్లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఎందుకు నిలిపివేశారు అని ప్రశ్నించినా, సమాధానం చెప్పలేదు, చంద్రబాబు తన స్వప్రయోజనాల కోసమే ఒక పథకం ప్రకారం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఆపివేశాడాని ప్రజలు, స్థానికులు చర్చించుకుంటున్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ఎందుకు ఆపివేశారంటే కూటమి నాయకులు ఎవ్వరూ సరైన సమాధానం చెప్పకుండా, డొంక తిరుగుడు మాటలు మాట్లాడుతున్నారు. 800 అడుగుల కన్నా క్రింద దిగువు భాగం నుంచే శ్రీశైలం జలాశయం నుండి తెలంగాణ ప్రాంతానికి ఒక్క రోజుకి 8 టీఎంసీల నీళ్లు తరలించకపోతుంటే, రాయలసీమ నెల్లూరు జిల్లాలకు రోజు మూడు టీఎంసీలు వాడుకుంటే రైతాంగానికి ఇబ్బంది లేకుండా పంటలు పండుతాయి. రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు జిల్లాకు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అతి ముఖ్యమైనది. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు రైతు సంఘాల నాయకులతో కలిసి సోమశిల జలాశయానికి వెళ్లి పరిశీలించి, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ లేకపోతే రైతులు పరిస్థితి ఏమిటి అని చెప్పబోతే మమ్మల్ని వెళ్లకుండా పోలీస్‌లు ఇంటి వద్దనే అడ్డుకున్నారు. కండలేరు జలాశయానికి వెళ్లి అందులో నీరు సమృద్ధిగా లేకపోతే రైతాంగం తీవ్ర ఇబ్బందుల పాలవుతుందని పరిశీలించడానికి వెళ్లబోతుంటే పోలీసులు మమ్మల్ని అడుగడుగునా అడ్డుకుని, అరెస్టు చేసి, కేసు నమోదు చేసి,రాపూర్ పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టారు. కూటమి నాయకులకు మాత్రం పోలీస్ లు రాచ మర్యాదలు చేసి కండలేరుకి తీసుకెళ్లారు. మేము రైతు సమస్యల మీద వెళ్లి పరిశీలించాలని చూస్తే, కూటమి నాయకులు మాత్రం అక్కడకి వెళ్లి మమల్ని దూషించి వచ్చారు. ఎవరు ఎన్ని కేసులు పెట్టుకున్నా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా,రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను సాధించుకునే వరకు పోరాడుతాం, మా పోరాటాలు కొనసాగిస్తాం. ఈ నెల 5వ తారీకు పోతిరెడ్డిపాడు వద్ద జరగనున్న సమావేశానికి వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు రైతు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా.

# 6వ తేదీన ఉపాధి కూలీల సదస్సును జయప్రదం చేయండి



**కాజులూరు, (రాజధాని వార్తలు):** ఈ నెల 6వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కాజులూరు మెయిన్ రోడ్‌లో ఉన్న అంబేద్కర్ భవ నంలో నిర్వహించనున్న ఉపాధి కూలీల సదస్సుకు కూలీలంతా హాజరు కావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వలస రాజబాబు పిలుపునిచ్చారు. దుగ్గుదూరు గ్రామంలో వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని, అలాగే ఈ పథకానికి సంబంధించిన మొత్త బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం భరించాలని వారు డిమాండ్ చేశారు. 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడి వామపక్షాలు ఈ చట్టాన్ని సాధించాయని, ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. అయితే 2014 నుంచి బీజేపీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు ఈ పథకానికి తగ్గిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో పథకం పేరును మార్చి జి.బి. రాంజీ పేరును తీసుకురావడం ద్వారా మహాత్మా గాంధీ పేరును తొలగించారన్నారు. ఇంతకాలం 90% నిధులు కేంద్రం భరించగా, ఇప్పుడు 60% మాత్రమే భరిస్తూ మిగతా 40% (దాదాపు 3 వేల కోట్లు) రాష్ట్రాలపై భారంగా మోపుతున్నారని పేర్కొన్నారు. ఇది రాష్ట్రానికి భారమై ప్రజలకు నష్టమవుతుందని, అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సింది పోయి, కేంద్రం చెప్పిందే చెప్పినట్టు అడుగులకు మడుగులు వేస్తున్నాయని వారు విమర్శించారు. పథకం పేరు మళ్లీ మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్మెంట్ గ్యారంటీ స్కీమ్‌గా కొనసాగించాలని, నిధులు 100% కేంద్రం భరించాలని, ఉపాధి కూలీలకు రోజుకి 600 కూలి, సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనేక మంది ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# కరపలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం

**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం, స్థానిక నక్కా సూర్య నారాయణ మూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ (మహిళల కళాశాల)లో మంగళవారం డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో మాదక ద్రవ్య వ్యసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగం రాజరాజేశ్వరి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఈగల్ డిపార్ట్‌మెంట్, కాకినాడ జిల్లా ఎన్‌డీపీఎస్ టీమ్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ధర్మతేజ, షరీఫ్‌లు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు వివరించారు. కాకినాడ జిల్లా ఎన్‌డీపీఎస్ టీమ్ ఇన్‌చార్జ్ పీటర్, ఆయన బృంద సభ్యులు, కరప ఏఎస్ఐ సూరిబాబు పాల్గొని మాదకద్రవ్యాల వ్యసనం వల్ల యువత భవిష్యత్తు ఎలా నాశనం అవుతుందో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సంపాదకీయం

## వాణిజ్య బంధాలూ సమర వివాదాలూ

రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రెండో రోజే పార్లమెంటులో తీవ్ర గందరగోళం నెలకొన్నది. దీన్నిబట్టి చూస్తే అసలు పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలన్న ఉద్దేశం అటు ప్రతిపక్షాలకు కానీ, ఇటు ప్రభుత్వానికి కానీ ఉన్నదా అన్న అనుమానం వస్తోంది. సాధారణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగడం ఆనవాయితీ. ఆ తర్వాతే బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు మొదలవుతాయి. పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి వెలువరించే ప్రసంగం ఒక రకంగా ప్రభుత్వ విధాన డాక్యుమెంట్. నిజానికి మోదీ ప్రభుత్వం అమలుపరుస్తోన్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇస్తోన్న ప్రాధాన్యం గురించి రాష్ట్రపతి ప్రపంగం వివరించింది.. రాజకీయ విభేదాలు విస్మరించి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా జాతీయ ప్రజాప్రతినిధులు అందరూ దేశ ప్రయోజనాల కోసం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. విచిత్రమేమంటే బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజే పాలక, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలతో సభా సమావేశాలు కొనసాగలేని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఎవరు కారణం? రాష్ట్రపతి ప్రసంగంపై సోమవారం నాడు ప్రారంభమైన చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య కాంగ్రెస్‌పై వాడి వేడి బాణాలు సంధించారు. భారతీయ నాగరికత, సంస్కృతి, జాతీయవాదం, దేశభక్తి అనే వాటికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యతిరేకమని ఆయన మాట్లాడిన మాటలు కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయి. ఇప్పటికే అనేక గాయాలతో రెచ్చిపోతున్న కాంగ్రెస్ ఊరుకుంటుందా? ఆ వెంటనే కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రంగంలోకి దిగి తమ దేశ భక్తిని, జాతీయవాదాన్ని శంకించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మా దేశ భక్తి గురించి, భారతీయ సంస్కృతి గురించి బీజేపీ యువ ఎంపీ వ్యాఖ్యలు చేసినందుకే నేను కొన్ని వాక్యాలను చదివి వినిపించదలుచుకున్నాను' అని రాహుల్ మొదలుపెట్టారు. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పేరిట 2020లో చైనాతో జరిగిన సరిహద్దు ఘర్షణపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రచించిన పుస్తకంలో ఉన్న అంశాలపై 'కారవాన్' అనే పత్రిక వెలువడిన ఆ పుస్తక భాగాలను చదవ సాగారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురించు నరవణే రాసిన వాక్యాలను చదవడం మొదలుపెట్టగానే బీజేపీ ఎంపీలు తీవ్ర గందరగోళం సృష్టించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇంకా ప్రచురణ కాని ఆ పుస్తకంలోని వాక్యాలను ఎలా చదువుతారని మంత్రులు ప్రశ్నించారు. స్పీకర్ ఓం బిర్లా కూడా 342 నిబంధన క్రింద అలా చదవడం కుదరదని స్పష్టం చేశారు. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్యే కాక, స్పీకర్‌కూ, ప్రతిపక్ష సభ్యుల మధ్య కూడా వాగ్వివాదం జరిగింది. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. తాను నరవణే పుస్తకంలో ఉన్న అంశాలు సరైనవేనని సాధికారికంగా చెబుతున్నానంటూ రాహుల్ స్పీకర్‌కు నోట్ సమర్పించి మరీ మళ్లీ ప్రసంగం ప్రారంభించారు. అయితే అధికార పక్షం వారు యథా ప్రకారం రాహుల్ మాట్లాడకుండా అడ్డుకున్నారు. ప్రధానమంత్రి అన్న పదం ఉచ్చరించినప్పుడల్లా స్పీకర్ అడ్డుకున్నారు. రాహుల్‌ను అడ్డుకుంటున్నారని గందరగోళం సృష్టించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు. చివరకు అనేక వాయిదాల తర్వాత సభ మళ్లీ బుధవారానికి వాయిదా పడింది. అసలీ పరిస్థితి ఎందుకు వచ్చింది? తేజస్వి సూర్య విమర్శనాస్త్రాలే కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయా? జనరల్ నరవణే పుస్తకంలోని అంశాలను రాహుల్ ప్రస్తావించకుండా బీజేపీ ఎందుకు అడ్డుకుంటోంది? నిజానికి నరవణే పుస్తకం వెలుగులోకి రాకుండా గత రెండేళ్లుగా కేంద్రం అడ్డుకుంటోంది. ఆ పుస్తకం ప్రచురించడానికి రక్షణమంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంతవరకూ పబ్లిషర్‌కు అనుమతినీయలేదు. 'నేను రాయాల్సింది రాశాను. ఇక ఆ పుస్తకాన్ని ఎలా విడుదల చేయాలో పబ్లిషరే తేల్చుకోవాలి' అని నరవణే అన్నారు. ఆ పుస్తకంలో తాను రాసిన అంశాలపై వస్తున్న వివాదం విషయమై కూడా ఆయన ఏ మాత్రం స్పందించలేదు. 'కారవాన్'లో వచ్చిన పుస్తక భాగాలపై కూడా ఆయన వ్యాఖ్యానించలేదు. అంటే తాను రాసిన వాటికి ఆయన కట్టుబడి ఉన్నట్లే కదా. భారత్ చైనాల మధ్య సరిహద్దు ఘర్షణలు కొత్త కాదు. ఆ పొరుగు దేశంతో విభేదాలు యుద్ధానికి దారితీయడంలో నెహ్రూ ప్రభుత్వ తప్పిదాల గురించి అనేక పుస్తకాలు వచ్చాయి. చైనాతో యుద్ధం జరుగుతున్నప్పుడు అసోంను కోల్పోతామేమోనన్న ఆవేదనను నెహ్రూ వ్యక్తపరిచారు. 'నా హృదయం అసోం ప్రజలకోసం తపిస్తోంది..' అన్న ఆయన ఆవేదనా పూరిత వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. కాంగ్రెస్ హయాంలో జరిగిన అనేక తప్పిదాలు, సంభవించిన పరాజయాలు, వాటిల్లిన వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఇవాళ కాంగ్రెస్ పార్టీ దేశ రక్షణ, భద్రత నుంచి అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడేందుకు, ఎన్నికల పరాభవాల నుంచి కోలుకోలేకపోతున్నందుకు అవే కారణం. మరి మోదీ హయాంలో ఇలాంటి విషయాలపై చర్చ జరిగేందుకు కూడా ఆస్కారం లేకుండా పోతోంది. ఏ చిన్న విజయం లభించినా ఉప్పొంగిపోయి, అమితోత్సాహం ప్రదర్శించి ప్రచారార్భాటాలు చేసేవారు జాతీయ ప్రాధాన్యమున్న వివాదాలపై చర్చించడానికి నిరాకరించడం దేనికి? జనరల్ నరవణే పుస్తకం బయటకు వచ్చి ఉంటే దానిపై కొద్ది రోజులు చర్చ జరిగి సమసిపోయివుండేది. గల్వాన్ లోయలో చైనా చొచ్చుకువస్తున్నప్పుడు 'మీకేది సముచితమో అదే చేయండి' అని ప్రధానమంత్రి తనకు చెప్పారని రక్షణమంత్రి వెల్లడించినట్లు నరవణే రాశారు.

# జర్నలిస్టుల బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే


**- ఫెడరేషన్ సభ్యత్వానికి భారీ స్పందన - రేపు సాయంత్రం తొలి విడత ముగింపు**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సమాజ ప్రగతిలో జర్నలిస్టులు పాత్ర అత్యంత కీలకమని కాబట్టి వారి సమస్యలు పరిష్కారం బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేనిని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఎజె)ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు పేర్కొన్నారు. మంగళవారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్జీవో హోంలో వర్కింగ్ జర్నలిస్టుల (ఫెడరేషన్) సభ్యత్వ నమోదు సందర్భంగా జరిగిన సమావేశంలో వీరు మాట్లాడుతూ జర్నలి స్టులకు సంబంధించిన అనేక అంశాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో చాలాకాలం నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇవన్నీ సకాలంలో పరిష్కారం కావాలంటే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇక ఫెడరేషన్ నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి భారీ స్పందన లభిస్తుందన్నారు. గత నెల 28న ప్రారంభమైన సభ్యత్వ నమోదుకు సంబంధించి మంగళవారం నాటికి 300 మంది దాటి జర్నలిస్టులు తమ సభ్యత్వ రెన్యువల్స్ పూర్తి చేసుకున్నారన్నారు. బుధవారం సాయంత్రం వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం జాబితాని సిద్ధం చేసి రాష్ట్ర కార్యవర్గానికి నివేదించడం జరుగుతుందన్నారు. కాబట్టి తమ యూనియన్ లో చేరాలనుకున్న జర్నలిస్టులు వెంటనే సభ్యత్వం నమోదు చేయించుకోవాలని కోరారు. అయితే అటువంటి వారు వర్కింగ్ జర్నలిస్టులగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రామకృష్ణ, పక్కి వేణుగోపాల్, బ్రాడ్ కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్ష.. కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్, రాజశేఖర్, బొబ్బర ప్రసాద్, ఎంవి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ బజార్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సూపర్ బజార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రిజిస్ట్రే షన్ ప్రక్రియలు, పత్రాల పరిశీలన, స్టాంప్ డ్యూటీ వసూలు విధానాలపై సమగ్రంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ, ప్రయివేటు భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలు, అవలంబిస్తున్న పద్ధతులు, నిబంధనలు తదితర అంశాలపై కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. సేవల్లో ఎలాంటి జాప్యం జరగకుండా, పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నిబంధనల ప్రకారం పని చేయాలని, ప్రతి దరఖాస్తుదారుడికి సమానంగా సేవలు అందేలా చూడాలన్నారు. రికార్డుల నిర్వహణలో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని, సిబ్బంది హాజరు, పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో వేచి ఉన్న పౌరులతో మాట్లాడిన కలెక్టర్ సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, సబ్ రిజిస్ట్రార్ కనకరత్నం, ఇతర అధికారులు ఉన్నారు.

# పోస్టల్ సేవలపై విస్తృత ప్రచారం

**- పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వినతి**



**ఆలమూరు, (రాజధాని వార్తలు):** జాతీయ పోస్టల్ శాఖ వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో పోస్టల్ శాఖ తాము అందిస్తున్న సేవలు, పథకాలపై మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించింది. రామచంద్రపురం పోస్టల్ శాఖ ఉన్నతాధికారి వంశీకృష్ణ ఆదేశాల మేరకు చింతలూరు పోస్ట్ మాస్టర్ టి.సూర్యనారాయణరెడ్డి తమ పరిధిలోని పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, గుమ్మిలేరు, మోదుకూరు గ్రామాల్లో సిబ్బంది చేత ప్రచారం చేయించారు. పొదుపు పథకాలు, డిపాజిట్లు, సుకన్య సమృద్ధి యోజన, ప్రజా భవిష్యత్ నిధి తదితర పథకాలతో పాటు ఏటీఎం, ఆన్లైన్ సేవలు అందిస్తున్నామని సిబ్బంది ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలందరూ ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోస్టల్ సిబ్బంది గట్టి వెంకటేశ్వరరావు, షేక్ అహ్మద్ ఆలీ, వాసంశెట్టి గణేష్, సీతామహాలక్ష్మి, అపర్ణ, శేషరాణి, విజయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఎఫ్ ఆర్ కు బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ) కు దేశ విదేశాల నుండి ఎంతోమంది అతిథులు వస్తారని అందుకు విశాఖ బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఫిబ్రవరి 15వ తేదీ నుండి జరుగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొరకు జీవీఎంసీ పనులపై ఆర్కే బీచ్ పరిసర ప్రాంతాలను జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ ముందుగా ఆర్కే బీచ్ వద్ద ఒక పొర వేసిన బీటీ రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన నిర్వహించే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు ఎంతోమంది దేశ విదేశాల నుండి అతిథులు వస్తారని అందుకు విశాఖ బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిది ద్దాలని అధికారులను ఆదేశించామన్నారు. బీచ్ రోడ్డులో, బీచ్ లో వ్యర్థాలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాలను ఎప్పటి కప్పుడు తరలించాలని, బీచ్ క్లీనింగ్ మిషన్ల సహాయంతో ఇసుక లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని , రాత్రి పారిశుధ్య పనులపై నిత్య పర్యవేక్షణ జరపాలని ప్రజా ఆరోగ్య అధికారు లను ఆదేశించారు. విద్యుత్ దీపాలు, సోలార్ లైటింగ్ అన్ని పూర్తిస్థాయిలో వెలిగేలా నిరంతర పర్యవేక్షణ జరుపుతూ తగిన చర్యలు చేపట్టాలని, ఫుట్ పాతులను మరమ్మతులు చేపట్టి పెయిం టింగ్ పనులు, రోడ్డు మార్కింగ్‌లు పూర్తి చేయడంతో పాటు సెంటర్ మీడియన్లను వ్యర్థాలు లేకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను, హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజా ఆరోగ్య విభాగం అధికారులు ఇంటర్నేషనల్ ఫీట్ రివ్యూ పూర్తయ్యే వరకు సంయుక్త కార్యాచరణ చేపట్టి సంబంధిత పనులను వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. విశాఖలో నిర్వహించే ఫ్లీట్ రివ్యూకు విశాఖ మ్యూజియమును అతిథులు, సందర్శకులు సందర్శిస్తారని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు మ్యూజియంను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన ఇంజనీరు పీవీ సత్యనారాయణ రాజు, ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్ ఏడుకొండలు తిరుమలరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు గంగాధర్, మురళీకృష్ణ, సహాయక వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించేందుకు కేంద్రం చర్యలు

**- రాజమండ్రి ఎన్ఐఆర్‌సిఎ ద్వారా పొగాకు రైతులకు సాంకేతిక పరిజ్ఞానం**

**- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖిత పూర్వక పూర్వక సమాధానం**



**కాకినాడ, (రాజధాని వార్తలు):** పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని గణనీయంగా తగ్గించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా పొగాకు సాగు చేస్తున్న రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి రామనాథ్ ఠాకూర్ వెల్లడించారు. ఈ మేరకు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో తొమ్మిది రాష్ట్రాల్లో పొగాకు పంట సాగువుతుందని, దేశవ్యాప్తంగా పొగాకు వాడకాన్ని తగ్గించేందుకు రాష్ట్రాల సహకారంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, పొగాకు నాణ్యత, ఉత్పాదకత పెంపు, పొగాకులో హానికర పదార్థాల తొలగింపు ద్వారా ఎగుమతులను ప్రోత్సహించేందుకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో గల నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రికల్చర్ ద్వారా రైతులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద పంటల వైవిధ్యీకరణ కార్యక్రమం ద్వారా పొగాకు రైతులకు ప్రత్యామ్నాయ పంటలవైపు ప్రోత్సహించేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడంతో పాటు, సామర్థ్యాభివృద్ధి, మార్కెట్ అనుసంధానాల కోసం కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేసి వినియోగిస్తున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం, చంద్రమాంపల్లి గ్రామంలో రైతులకు పట్టాదారు పాసు బుక్‌లను తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూమి గల ప్రతీ రైతుకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని, కావున ప్రతీ రైతు పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకోవలసినదిగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి సభ్యులు రేలంగి వెంకట్రావు, రేలంగి బుజ్జి, మాజీ వైస్ సర్పంచ్ కంటిబోయిన చంటిబాబు, నీటి సంఘం డైరెక్టర్ రాసంశెట్టి సత్తిబాబు, వీఆర్వోలు వెంకటేశ్వరరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం డిఎస్పి కార్యాలయంలో వైసిపి ఇన్చార్జి దవులూరి వినతిపత్రం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై మంగళవారం సాయంత్రం పెద్దాపురం డిఎస్పి కార్యాలయంలో డిఎస్పి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దవులూరి దొరబాబు మీడియాతో మాట్లాడుతూ తిరుపతి లడ్డూ విషయంలో సిబిఐ కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు అసత్యమని తేల్చినా, విద్వేశాలకు తెరలేపే విధంగా కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులపై దాడులకు తెగబడుతున్నారని దొరబాబు ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర అయ్యారక విభాగం అధ్యక్షులు జవాల లక్ష్మీ నారాయణ, పెద్దాపురం జడ్పిటిసి గవరసాన సూచిబాబు, సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యూట్ లుక్స్‌తో మెస్మరైజ్ చేస్తున్న మాజీ మిస్ వరల్డ్!



సాధారణంగా ఇండస్ట్రీలోకి రావాలి అంటే మోడల్‌గా కెరియర్ను ఆరంభించి.. ఆ తర్వాత హీరోయిన్గా అవతరించే ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఇంకొంతమంది ఆ మోడల్గా కెరియర్ మొదలుపెట్టినా.. తమ అందంతో ప్రపంచ స్థాయి దృష్టిని ఆకర్షించి ఆ తర్వాత సినిమాల్లోకి వస్తున్నారు. ఇప్పటికే ఐశ్వర్య రాయ్, ప్రియాంక చోప్రాలాంటి వాళ్ళు తమ అందంతో ప్రపంచ స్థాయి దృష్టిని ఆకర్షించడమే కాకుండా మిస్ వరల్డ్‌గా కిరీటాన్ని దక్కించుకొని.. ఇప్పుడు సినిమాలలో కూడా స్టార్ హీరోయిన్లుగా కొనసాగుతున్నారు. ఇప్పుడు అలాంటి జాబితాలో మరో ముద్దుగుమ్మ కూడా చేరిపోయిన విషయం తెలిసిందే. ఆమె మానుషి చిల్లర్. 2017 మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొని విజేతగా నిలిచి, అందరి దృష్టిని ఆకట్టుకుంది. అలాంటి ఈమె 2017 ఫెమినా మిస్ ఇండియా పోటీలో హర్యానా రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించి మిస్ ఇండియా వరల్డ్ 2017 టైటిల్ ని కూడా గెలుచుకుంది. 17 సంవత్సరాల తర్వాత మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్న ఆరవ భారతీయురాలిగా కూడా రికార్డు సృష్టించింది మానుషి చిల్లర్. తన అందంతో అందరినీ ఆకట్టుకున్న ఈమె తొలిసారి 2022లో 'సామ్రాట్ పృథ్వీరాజ్' అనే సినిమా ద్వారా సినీ ఇండస్ట్రీకి పరిచయమైంది. ఆ తర్వాత 2023లో ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ, 2024లో బడే మియాన్ చోటే మియాన్ వంటి చిత్రాలలో కనిపించి సందడి చేసింది. ఈమధ్య ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కూడా కొన్ని ఫోటోలను పంచుకుంటూ అభిమానులను తన అందంతో గిలిగింతలు పెడుతోంది. అందులో భాగంగానే తాజాగా మరోసారి ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు పంచుకుంది ఈ ముద్దుగుమ్మ. అందులో వెకేషన్‌కి వెళ్ళినట్టు తెలుస్తోంది. ఆరంజ్ కలర్ బికినీ ధరించిన ఈమె దానిపైన నెట్‌తో డిజైన్ చేసిన మెష్ దుస్తులలో తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. ఒక రాతి స్తంభానికి ఆనుకొని స్టైలిష్ గా డ్రింక్ సేవిస్తూ.. తన హుందాతనాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేసింది. ఇక మరొక ఫోటోలో తన పెట్ డాగ్‌తో ఆప్యాయతగా ఉన్నట్టు మరో ఫోటో పంచుకుంది. ఇలా వెకేషన్‌కి సంబంధించిన కొన్ని ఫోటోలను పంచుకున్న ఈమె అందులో తన అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసే ప్రయత్నం చేసింది. మొత్తానికి ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. మానుషి 1997 మే 14న రోహ్ తక్‌లోని హర్యాన్వి కుటుంబంలో జన్మించింది. ఈమె పూర్వీకులు బమ్నోలి గ్రామానికి చెందినవారు. మానుషి చిల్లర్ తండ్రి మిత్రా బసు చిల్లర్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్లో వైద్యుడిగా పనిచేశారు. ఇప్పుడు ముంబైలోని సోమ వెల్నెస్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈమె తల్లి నీలం చిల్లర్.

న్యూఢిల్లీలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవి యర్ అండ్ అలైడ్ సైన్సెస్‌లో వైద్యురాలిగా పనిచేయడమే కాకుండా న్యూరో కెమిస్ట్రీ విభాగంలో హెడ్‌గా పనిచేస్తున్నారు. ఈమె 12వ తరగతిలోనే ఇంగ్లీష్ సబ్జెక్టులో ఆల్ ఇండియా సీబీఎస్ఈలో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే 96% ఇంటర్లో స్కోర్ కూడా చేసింది. మొదటి ప్రయత్నంలోనే ఆల్ ఇండియా ప్రీ మెడికల్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించి ఎంబిబిఎస్ చదువుతోంది. ఇక ఈమె కూచిపూడి నృత్యకారిణి కూడా.


# ప్రపంచంలోనే అత్యంత అందమైన టాప్ టెన్ హీరోయిన్స్ వీళ్ళే.. ఇండియా తరపున ప్రభాస్ బ్యూటీ!



అందం అనేది చూసే కళ్ళను బట్టి ఉంటుంది అంటారు, కానీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రియుల లెక్కల ప్రకారం ప్రతి ఏటా అత్యంత అందగత్తెల జాబితా విడుదలవుతూనే ఉంటుంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న గ్లోబల్ బ్యూటీస్ లిస్టులో హాలీవుడ్ భామలతో పాటు మన భారతీయ నటి కృతి సనన్ చోటు దక్కించుకోవడం విశేషం. ప్రభాస్ సరసన 'ఆదిపురుష్'లో నటించి మెప్పించిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు ప్రపంచ వేదికపై తన అందంతో అందరినీ ఆకట్టుకుంటోంది. గ్లోబల్ బ్యూటీస్ జాబితాలో మన 'జానకి': ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అందగత్తెల జాబితాలో మొదటి స్థానంలో హాలీవుడ్ సెన్సేషన్ మార్గోట్ రోబీ నిలవగా, షైలీన్ వుడ్లీ, డిల్రాబా దిల్‌మురాత్ వంటి అంతర్జాతీయ నటీమణులు వరుస స్థానాల్లో ఉన్నారు. అయితే, ఈ జాబితాలో 5వ స్థానాన్ని దక్కించుకుని మన ఇండియన్ సినిమా సత్తాను చాటింది కృతి సనన్. ఈమెతో పాటు నాన్సీ మెక్‌డోనీ, హానియా అమీర్, అనా డి అర్మాస్, ఎమ్మా వాట్సన్, అంబర్ హర్డ్ మరియు హండే ఎర్చెల్ వంటి ప్రపంచ ప్రసిద్ధ సుందరీమణులు ఈ టాప్-10లో చోటు సంపాదించారు. అత్యంత కఠినమైన పోటీని తట్టుకుని కృతి ఈ స్థానాన్ని గెలుచుకోవడం ఆమె ఫ్యాన్స్‌కు పండగే అని చెప్పాలి. ప్రభాస్‌తో కెమిస్ట్రీ.. 'ఆదిపురుష్'లో జానకి: ఇక కృతి సనన్ పేరు వినగానే తెలుగు ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది 'ఆదిపురుష్' సినిమా. ఈ చిత్రంలో గ్లోబల్ స్టార్ ప్రభాస్ సరసన 'జానకి' పాత్రలో ఆమె నటించిన తీరు అద్భుతం. రాముడిగా ప్రభాస్ గంభీరమైన రూపానికి, జానకిగా కృతి సుకుమారమైన అందం తోడై వెండితెరపై ఒక దృశ్య కావ్యాన్ని ఆవిష్కరించింది. కేవలం అందమే కాదు, ఆ పాత్రలో ఆమె పండించిన భావోద్వేగాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఈ సినిమా సమయంలోనే వీరిద్దరి కెమిస్ట్రీ గురించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ప్రభాస్‌లాంటి స్టార్ హీరోతో జోడీ కట్టి, ఇప్పుడు గ్లోబల్ లెవల్లో అందగత్తెగా గుర్తింపు పొందడం విశేషం. ఈ జాబితాలో చోటు సంపాదించడం అనేది కృతి సనన్ కేవలం గ్లామర్‌కే పరిమితం కాదని, ఆమెకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదరణకు ఇది నిదర్శనమని అర్థమవుతోంది. మహేష్ 'నేనొక్కడినే' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ సుందరి, ఇప్పుడు హాలీవుడ్ స్టార్స్ అయిన ఎమ్మా వాట్సన్, అంబర్ హర్డ్ వంటి వారితో పోటీ పడుతోంది. నటనలో నేషనల్ అవార్డ్ సాధించడమే కాకుండా, ఇప్పుడు గ్లోబల్ బ్యూటీస్ లిస్టులో టాప్‌లో నిలవడం ఆమె కెరీర్‌లో మరో గొప్ప మైలురాయి. గ్లోబల్ బ్యూటీస్ లిస్టులో మన కృతి సనన్ ఉండటం భారతీయులందరికీ గర్వకారణం. ప్రభాస్, మహేష్ లాంటి గ్లోబల్ స్టార్స్ పక్కన ఆమె చేసిన పాత్రలు ఆమెను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి. ఆమె ప్రయాణం ఇలాగే మరిన్ని విజయాలతో కొనసాగాలని కోరుకుందాం.

# చిరంజీవి గురించి మీకేం తెలుసు? లావణ్య స్ట్రాంగ్ కౌంటర్





ఇప్పుడు మెగా ఫ్యామిలీలో కలుగుతున్న ఆనందానికి అవధుల్లేవు. మెగా దంపతులు రామ్ చరణ్- ఉపాసన మరోసారి తల్లిదండ్రులవడంతో వారి ఇంట ఆనందం రెట్టింపైంది. ఈ దంపతులకు జనవరి 31 నాడు కవలలు జన్మించిన విషయం తెలిసిందే. ఆ కవలల్లో ఒక బాబు, ఒక పాప ఉండటంతో మెగా ఫ్యామిలీతో పాటూ వారి అభిమానులు కూడా తెగ సంతోషిస్తున్నారు. రెట్టింపైన ఆనందం ఆల్రెడీ చరణ్, ఉపాసనకు క్లీంకార అనే పాప ఉంది. ఇప్పుడు ఒక బాబు, పాప జన్మించారు. దీంతో మరోసారి తాత అయినందుకు చిరంజీవికి, చరణ్-ఉపాసన దంపతులకు పలువురు సెలబ్రిటీలు, ఫ్యాన్స్ సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అంతేకాదు, కవలల రాకతో ఆనందం రెట్టింపవడంతో ఫ్యాన్స్ దీన్నొక పండగలా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఒశ్రీబనీ ఖీవజీట - శేఖరుడు ఆ సీట్‌ని భర్తీ చేస్తే ఇక తిరుగే ఉండదు! వారసుడి విషయంలో చిరంజీవిపై విమర్శలు మెగా ఫ్యామిలీలోకి వారసుడు రావడంతో గతంలో వారసుడి విషయంలో చిరంజీవి చేసిన కామెంట్స్‌ను గుర్తు చేస్తూ ఆయన్ని ఓ వర్గం నెటిజన్లు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. నెట్టింట చిరంజీవిపై వస్తున్న నెగిటివ్ కామెంట్స్‌కు మెగా కుటుంబ కోడలు, టాలీవుడ్ హీరోయిన్ లావణ్య త్రిపాఠి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. మెగా ఫ్యామిలీకి వారసుడు రావడంపై ఓ జర్నలిస్ట్ నెగిటివ్ కామెంట్ చేయడం చూసి, కొందరు చిరంజీవిని ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఆ జర్నలిస్టు ట్వీట్‌కు లావణ్య కాస్త ఘాటుగానే రిప్లై ఇచ్చారు. సాధారణంగా తాను ఇలాంటి ట్వీట్స్‌ను పట్టించుకోనని, కానీ ఇలాంటివి ఓ జర్నలిస్ట్ నుంచి తాను ఊహించలేదని, మీ ట్వీట్‌తో ఓ సంతోషకరమైన వాతావరణాన్ని చెడగొట్టారని, చిరంజీవి తన ఫ్యామిలీలోని మహిళలకు ఎంత గౌరవమిస్తారనేది మీకు తెలియదని, ఆయన చేసే దానిలో మిగతా వాళ్లు 1% కూడా చేయరని, తెలియని వారి గురించి కామెంట్ చేయకపోవడం బెటర్ అని లావణ్య పోస్ట్ చేశారు. దీంతో సదరు జర్నలిస్ట్ ఆ ట్వీట్‌ను తన ఖాతా నుంచి తొలగించారు. లావణ్య చెప్పినట్టు చిరంజీవి ఆడవారికి, మరీ ముఖ్యంగా తన ఫ్యామిలీలోని ఆడవాళ్లను ఎంతగా గౌరవిస్తారో అందరికీ తెలిసిందే. తన తల్లి నుంచి భార్య, చెల్లెల్లు, పిల్లలు, మనవరాళ్లు అందరినీ చిరంజీవి ఎంతో ప్రేమగా చూసుకుంటారు. ఈ విషయాన్ని పలు సందర్భాల్లో వారే చెప్పారు కూడా. అలాంటి చిరంజీవిని వారసుడి విషయంలో విమర్శించడం అస్సలు కరెక్ట్ కాదని మెగా ఫ్యాన్స్ మండిపడుతున్నారు.

కాగా గతంలో చిరంజీవి, ఓ సందర్భంలో మనవడు ఉంటే బావుంటుందని కామెంట్ చేసిన విషయం తెలిసిందే. ఇంట్లో ఎటు చూసినా ఆడవాళ్లే ఉన్నారని, అలా ప్రతీ క్షణం చుట్టూ ఆడవాళ్లను చూడటం వల్ల తనకు లేడీస్ హాస్టల్ వార్డెన్ లాగా ఉన్న ఫీలింగ్ కలుగుతుందని కామెంట్ చేయగా, ఆ కామెంట్స్ అప్పట్లో పెద్ద చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే.

# హిట్ మెషీన్ ఫోన్ చేస్తే గూగుల్ చేసిందంట!



వరుస బ్లాక్ బస్టర్ హిట్‌లతో టాలీవుడ్‌లో దర్శకుడిగా ప్రత్యేకతను చాటుకుంటున్నారు అనిల్ రావిపూడి. సక్సెస్‌కు మారుపేరుగా నిలిచిన ఆయన ఇప్పుడు టాలీవుడ్‌లో హిట్ మెషీన్. టాప్ స్టార్లతో చెప్పి మరీ బ్లాక్ బస్టర్ హిట్‌లు అందించి సరికొత్త రికార్డుని సొంతం చేసుకున్నారు. గత ఏడాది విక్టరీ వెంకటేష్‌తో సంక్రాంతికి వస్తున్నాం అంటూ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాతో ప్రేక్షకుల్ని అలరించడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద నిర్మాతలకు కాసుల వర్షం కురిపించారు. గత ఏడాది సంక్రాంతి బరిలో నిలిచిన ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా ఊహించని విధంగా రూ.300 కోట్ల పైచిలుకు వసూళ్లని రాబట్టి ట్రేడ్ వర్గాలని విస్మయానికి గురి చేసింది. ఇక ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన మన శంకరవరప్రసాద్‌గారు కూడా అదే మ్యాజిక్‌ని రిపీట్ చేసి మెగాస్టార్‌కు బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించింది. వింటేజ్ చిరుని పరిచయం చేసిన తీరు, ఫ్యామిలీ ఎమోషన్స్, అంతే మోతాదులో కామెడీని పండించిన తీరుకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు.. చిరు సినిమాకు బాక్సాఫీస్ వద్ద బ్రహ్మరథం పట్టారు. దీంతో ఈ సినిమా సంక్రాంతి విన్నర్‌గా నిలవడమే కాకుండా 2026 ప్రారంభంలో అత్యధిక వసూళ్లని రాబట్టిన తొలి ప్రాంతియ చిత్రంగా రికార్డు సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే హిట్ మెషీన్ అనిల్ రావిపూడి ఫోన్ చేస్తే గూగుల్ చేసిందంట హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భాగ్యంగా తనదైన మార్కు నటనతో గోదావరి యాసతో ఆకట్టుకుని సినిమా విజయంలో తనదైన పాత్ర పోషించింది ఐశ్వర్య రాజేష్. అయితే తనకు ఈ సినిమా చేసే వరకు అనిల్ రావిపూడి ఎవరో తెలియదని చెప్పి షాక్ ఇచ్చింది. ఓ పోడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ ఐశ్వర్యా రాజేష్ చేసిన వ్యాఖ్యాలు ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతూ అందరిని షాక్‌కు గురి చేస్తున్నాయి. సుడల్ సిరీస్‌లో నటిస్తున్న సమయంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి నుంచి తనకు కాల్ వచ్చిందట.

అమ్మా నేను అనిల్ రావిపూడిని డైరెక్టర్‌ని మాట్లాడుతున్నాను అని చెప్పగానే తను ఎవరన్నది అంత వరకు తనకు తెలియకపోవడంతో అనిల్ గురించి గూగుల్ చేసిందట. తన గురించి తెలుసుకున్నాక చెప్పండి సార్ అని అడగడంతో ఆడిషన్‌కి వస్తావా అని అనిల్ అడిగాడట. ఆయన ఆడిషన్ అనగనే నాకు ఒక్క నిమిషం ఏమీ అర్థం కాలేదు. ఆడిషన్ ఇవ్వడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ తెలుగు సినిమాలో ఆడిషన్ అనే సరికి కొంత కంగారు పడ్డాను. హిందీ, ఇంగ్లీష్ సినిమాలకు ఎంత పెద్ద ఆర్టిస్ట్ అయినా ఆడిషన్ ఇవ్వాల్సిందే. కానీ తెలుగు సినిమాకు ఆడిషన్ అనగానే షాక్ అయ్యాను. చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. వెంటనే ఆయనకు ఓకే చెప్పి ఆడిషన్ కోసం హైదరాబాద్ వచ్చేసి ఆయనని కలిశాను. లుక్ టెస్ట్‌తో పాటు నాతో రెండు, మూడు డైలాగ్‌లు చెప్పించారు. స్టోరీ చెప్పిన తరువాత అనిల్ గారు ఇది నేను చేయలేను.

# మంత్రి నారా లోకేష్‌కు ఎంపీ వేమిరెడ్డి ఆత్మీయ స్వాగతం









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టుల విషయమై కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీ చేరుకున్న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం రాత్రి ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న నారా లోకేష్‌కి ఎంపీ వేమిరెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీని నారా లోకేష్ ఆప్యాయంగా పలకరించారు.


# విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ



**అమలాపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతుడై విద్యలో రాణించాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కంటి అద్దాలను ఆయన పంపిణీ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కేవలం సిలబస్ మార్పులకే కాకుండా విద్యార్థుల శారీరక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. "చదువు కావాలి – ఆరోగ్యంగా ఉండాలి" అనే నినాదంతో పాఠశాల స్థాయిలోనే కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థుల కు ఉచితంగా అద్దాలు పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు మేలు జరుగుతోందన్నారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులు ఆకుకూరలు, క్యారెట్, గుడ్లు వంటి పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలని తద్వారా కంటి చూపు మెరుగుపడుతుందని విద్యార్థులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. గంటల తరబడి సెల్ ఫోన్లు చూడటం వల్ల కంటి కండరాలు దెబ్బతింటాయని చదువుకు అవసరమైన ప్పుడు తప్ప మొబైల్స్‌కు దూరంగా ఉండాలన్నారు. నిరంతరం కళ్లను చల్లని నీటితో కడుక్కోవాలని మసకగా ఉన్నా లేదా కంటి నొప్పి వచ్చినా వెంటనే ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలపాల న్నారు. కంటి చూపు సమస్య ఉంటే విద్యార్థులు పాఠ్యాంశాలను సరిగ్గా గమనించలేరని ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమం తప్పకుండా అద్దాలు ధరించి చదువులో ప్రతిభ కనబరచాలని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, కూటమి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ మనుగడకు బయోటెక్నాలజీ కీలకం

## - నెల్లూరులో ఘనంగా ముగిసిన అంతర్జాతీయ బయో టెక్నాలజీ సదస్సు













**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భవిష్యత్తులో మానవ జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో బయోటెక్నాలజీ ఆవిష్కరణలే కీలక పాత్ర పోషిస్తాయని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. నెల్లూరులోని విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు మంగళవారం ఘనంగా ముగిసింది.కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పీఎం ఉషా (పిఎం–ఉషా) పథకం నిధులతో "ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేషన్స్ అండ్ ఇంటిగ్రేషన్స్ ఇన్ బయోటెక్నాలజీ" పేరిట ఈ సదస్సును ఫిబ్రవరి 2, 3 తేదీలలో నిర్వహించారు.

**ఆవిష్కరణలే లక్ష్యం:**

ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలపై పరిశోధనలు మరింత ముమ్మరం కావాలని ఆకాంక్షించారు. ఈ రంగం మానవాళి మనుగడకు, ఆరోగ్య భద్రతకు అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు.

**పరిశోధనాత్మక దృక్పథం ముఖ్యం:**

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కే. సునీత ప్రసంగిస్తూ, అంతర్జాతీయ స్థాయి సదస్సులు విద్యార్థులు మరియు యువ పరిశోధకులలో పరిశోధనాత్మక దృక్పథాన్ని (Research Mindset) పెంపొందించడానికి దోహదపడతాయని తెలిపారు.

**సుస్థిర అభివృద్ధిలో బయోటెక్నాలజీ:**

కార్యక్రమంలో గ్రీన్ ఎకానమీ అంబాసడర్ మరియు ఐసీఎస్టీఐ చీఫ్ ఎక్స్‌పర్ట్ లింగుట్ల జయరాములు ప్రత్యేక ప్రసంగం చేశారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (Sustainable Development Goals) సాధనలో బయోటెక్నాలజీ పాత్రను ఆయన వివరించారు. గ్రీన్ ఎకానమీని బలోపేతం చేయడానికి శాస్త్రీయ పరిశోధనలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.విస్తృత భాగస్వామ్యం:ఈ రెండు రోజుల సదస్సులో దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. సదస్సులో పాల్గొన్నవారికి ధృవీకరణ పత్రాలను ఇచ్చారు మరియు అతిథులను సత్కరిచారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, ఆచార్య టి. వీర రెడ్డి, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ జి. మేరీ సందీప్, డాక్టర్ సిహెచ్. కిరణ్మయి, డాక్టర్ కేవీఎల్ కన్యరావు, డాక్టర్ ఎస్.బి. సాయినాథ్, డాక్టర్ వి.సదా సూర్య (యం.ఎస్ జనరల్ సర్జరీ, తిరుపతి), డాక్టర్ పి. విజయ భాస్కర్ రెడ్డి (అస్సాం యూనివర్సిటీ) తదితరులు పాల్గొ న్నారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు అంతర్జా తీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లభించిందని నిర్వాహకులు తెలిపారు.

# పేదల కళ్లలో కాంతులు నింపే నిరంతర యజ్ఞం.. విపిఆర్ నేత్ర

**- ఇప్పటివరకు ఉదయగిరి నియోజకవర్గంలో 4 మండలాల్లో పూర్తయిన సేవలు - వింజమూరు మండలం నుంచి ప్రారంభమైన విపిఆర్ నేత్ర - మొత్తం 19737 మందికి ఉచితంగా పరీక్షలు, 11342 మందికి కంటి అద్దాలు - చూపునిచ్చిన విపిఆర్‌పై సర్వత్రా హర్షాతిరేకాలు**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సేవ అంటే దానం కాదు...బాధలో ఉన్న వారి కళ్లలో ఆశలను నింపడం.. నిరుపేదల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేయడం.. అదే తన జీవితాశయంగా పని చేస్తున్నారు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. కళ్లకు చూపు... జీవితాలకు కొత్త దారి ఇవ్వాలన్న లక్ష్యంతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించిన విపిఆర్ నేత్ర వేల కళ్లలో వెలుగులు నింపుతూ.. వారి కుటుంబాల్లో చిరునవ్వులకు కారణమవుతోంది. గ్రామ గ్రామాన తన చరితను లిఖిస్తూ ముందుకు సాగుతోంది. విపిఆర్ సంకల్పం.. సమాజ హితానికి బాసగటా నిలుస్తోంది. నవంబర్ 3, 2025న వరికుంటపాడు మండలం రామాపురం నుంచి ప్రారంభమైన విపిఆర్ నేత్ర బస్సు సేవలు నేటితో 3 నెలలు పూర్తి చేసుకుంది. ఈ మూడు నెలల కాలంలో వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు మండలాల్లో గ్రామీణ పేదలకు కంటి పరీక్షలు చేసి వారికి ఉచితంగా అద్దాలు అందజేశారు. ఈ నాలుగు మండలాల్లో 19,737 మందికి పరీక్షలు, 11342 మందికి అద్దాలు అందించారు.

ఇక మండలాల వారీగా చూస్తే...

1. వరికుంటపాడు మండలంలో 24 పంచాయతీల్లో 5257 మందికి టెస్టులు చేసి 2845 మందికి కంటి అద్దాలు అందించారు. 2. ఉదయగిరి మండలంలో 17 పంచాయతీల్లో 5006 మందికి కంటి పరీక్షలు చేయగా.. 3009 మందికి ఉచితంగా అద్దాలు అందించారు. 3. సీతారామపురం మండలంలో 14 పంచాయతీల్లో 4153 మందికి పరీక్షలు చేసి 2380 మందికి కంటి అద్దాలు అందజేశారు. 4. దుత్తలూరు మండలంలో 17 పంచాయతీల్లో 5043 మందికి కంటి పరీక్షలు చేసి 2944 మందికి అద్దాలు సమకూర్చారు. 5. ప్రస్తుతం వింజమూరు మండలంలో విపిఆర్ నేత్ర సేవలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 72 పంచాయతీల్లో సేవలు..

ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం 143 పంచాయతీలు ఉండగా.. నాలుగు మండలాల్లో 72 పంచాయతీల్లో పంచాయతీల్లో విపిఆర్ నేత్ర సేవలు పూర్తయ్యాయి. అన్ని చోట్లా విపిఆర్ నేత్ర సేవలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం తోడవడంతో ఈ సేవలు మరింత విస్తృతం అవుతున్నాయి. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కల సాకారం అవుతోంది. ఇక్కడ అందుతున్న నాణ్యమైన సేవలు కంటి అద్దాలు అందుతున్నాయన్న సమాచారంతో రోజురోజుకు వస్తున్న ప్రజల సంఖ్య భారీగా ఉంటోంది.

**రాత్రి 8 గంటల వరకూ..**

విపిఆర్ నేత్ర సిబ్బంది.. బస్సు వద్దకు వచ్చే ప్రజలకు ఎంతో ఓపికగా పరీక్షలు చేస్తున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలు భారీగా వస్తుండటంతో రాత్రి 8, 9 గంటల వరకు కూడా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ అద్దాలు అందిస్తున్నారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నారు. ఇది విపిఆర్ అందించిన ప్రోత్సాహంతోనే సాధ్యమైంది. "వి.పి.ఆర్ నేత్రతో తమ చూపు మెరుగుపడిందని గ్రామీణులు సంతోషం వ్యక్తం చేయడం మరింత సంతృప్తిని ఇస్తోంది. మా ఊరికే బస్సు రావడం, బస్సులో ఉచితంగా కంటి పరీక్షలు చేయడం చూస్తామని కలలో కూడా ఊహించలేదని పలువురు ఆనంద భాష్పాలు రాల్చుతున్నారు. విపిఆర్ సేవా దృక్పథానికి, పేదల పట్ల ఆయనకున్న మక్కువకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# మానవత్వం చాటుకున్న వేమిరెడ్డి దంపతులు

## - సచివాలయ ఉద్యోగి సతీమణి వైద్యానికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో తమకు తామే సాటి అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు మరోసారి నిరూపించుకున్నారు. నెల్లూరు నగరపాలక సంస్థలో సచివాలయ ప్లానింగ్ కార్యదర్శిగా పనిచేస్తున్న రఘు సతీమణి పావని వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 3 లక్షల రూపాయల భారీ ఆర్థిక సహాయాన్ని అందజేసి వారి కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. నెల్లూరు నగరపాలక సంస్థలో సచివాలయ కార్యదర్శి రఘు సతీమణి పావని గత కొంతకాలంగా తీవ్రమైన కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వైద్య ఖర్చులు తడిసి మోపెడవ్వడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని నెల్లూరు మేయర్ పి. రూప్ కుమార్ యాదవ్ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నిమిత్తం ఢిల్లీలో ఉన్న ఎంపీ గారు విషయం వినగానే చలించిపోయి, తక్షణమే సాయం అందించాలని తన సతీమణి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి సూచించారు. ఎంపీ సూచన మేరకు మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాగుంట లేఅవుట్‌లోని తమ నివాసంలో మేయర్ మరియు మున్సిపల్ కమిషనర్ సమక్షంలో రఘుకు రూ. 3 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ మేయర్ పి కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజాసేవ అంటే కేవలం అభివృద్ధి పనులే కాదని ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమని వేమిరెడ్డి దంపతులు నిరూపించారన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక మహిళను ఆదుకోవడానికి వారు ముందుకు రావడం అభినందనీయమని నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ దంపతుల దాతృత్వాన్ని కొనియాడారు. సచివాలయ ఉద్యోగి కష్టాన్ని తమ సొంత కష్టంగా భావించి స్పందించిన వేమిరెడ్డి దంపతుల సేవా దృక్పథం గొప్పదని మానవత్వమే చిరునామాగా వారు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. తమ కుటుంబం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆపన్న హస్తం అందించి, కొండంత ధైర్యాన్ని నింపిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి రెడ్డి దంపతులకు రఘు మరియు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు మరియు బాధితుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం కేటాయించే ప్రతి రూపాయి ప్రజలకు చేరాలి

## - రాష్ట్ర శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ప్రతి రూపాయిని కూడా ప్రజలకు చేరువ చేయడమే ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ ప్రధాన లక్ష్యమని కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావుతో పాటు సభ్యులు మద్దిపాటి వెంకట రాజు, పాశం సునీల్‌కుమార్, వి.వి. సూర్యనారాయణరాజు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ సెక్రటరీ భిక్షం, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. సమావేశంలో తొలుత జిల్లాలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల వివరాలను ఆయా శాఖల అధికారులు కమిటీ సభ్యులకు వివరించారు. సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ సంక్షేమ శాఖలు, డీఆర్‌డిఎ, మెప్మా, వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇరిగేషన్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు తమ శాఖలకు సంబంధించిన బడ్జెట్ వినియోగంపై సమగ్రంగా వివరించగా, కమిటీ సభ్యులు చర్చించారు. సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, జిల్లాలో శాఖల వారీగా ఎంత బడ్జెట్ విడుదలైంది, ఎంత మేర ఖర్చు జరిగింది అనే అంశాలపై సమగ్రంగా కమిటీ అధ్యయనం చేస్తుందన్నారు. జిల్లాలో ఏ పథకానికి ఎక్కువ డిమాండ్ ఉందో గుర్తించి, ఆ పథకానికి అధికంగా నిధులు విడుదల అయ్యేలా ఎస్టిమేట్స్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. జిల్లా స్థాయి నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ శాసనసభ వరకు చేరుతుందని, దాని ద్వారా జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు మరింత అవకాశం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వివరించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై సమగ్ర వివరాలతో బుక్‌లెట్ తయారు చేయడం పట్ల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను ప్రత్యేకంగా అభినందించారు. గత ప్రభుత్వ కాలంలో ఇచ్చిన బడ్జెట్ కేటాయింపులపై సమీక్ష నిర్వహించామని, అధికారులు పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను ఖర్చు చేసి నట్లు తెలిపారు. సమావేశంలో పలు సమస్యలను తమ దృష్టికి తీసుకు వచ్చారని, పాఠశాల భవనాల పరిస్థితి సంతృప్తికరంగా లేదన్న అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పరిశీలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ప్రతి రూపాయి ఉపయోగపడేలా ఎక్కడ అవసరమో అక్కడే నిధులు ఖర్చు చేయాలని, పథకాల ద్వారా పేదలకు ఎంతమేర లాభం చేకూరుతోందో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ బడ్జెట్‌ను కేవలం ఖర్చు చేయడమే కాకుండా, ఆ ఖర్చుతో ప్రజలకు ఎంతమేర మేలు జరుగుతోందో కూడా అధికారులు అధ్యయనం చేయాలని సూచించారు. చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ ఫలాలు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అమలవుతున్న కార్యక్రమాల ద్వారా సమాజానికి వాస్తవ ప్రయోజనం కలగాలన్నారు. కమిటీ సభ్యులు, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. చేసిన ప్రతి ఖర్చుకు స్పష్టమైన లెక్కలు చూపాల్సి ఉంటుందన్నారు. అన్ని రంగాల్లో అనుభవం కలిగిన సభ్యులతో కూడిన ఈ ఎస్టిమేట్స్ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ తప్పిదాలు జరగకుండా పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. హాస్పిటల్స్, పాఠశాల భవనాల పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల కూల్చివేతకు నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను కోరారు. అలాగే అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయాలని సూచించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా తమ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురవుతోందని, బడ్జెట్ కేటాయింపుల్లో ఉదయగిరికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గండిపాలెం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించి మెట్టప్రాంత రైతులకు అండగా నిలవాలని, సాగునీటి రంగ అభివృద్ధికి నిధులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయ్ కుమార్, డిఆర్‌డిఎ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు నాగరాజకుమారి, గంగా భవాని, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, మత్స్య, పశు సంవర్ధక శాఖ జేడీలు రమేష్ నాయక్, శాంతి, డీఎంఅండ్ హెచ్‌వో సుజాతతో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# "సర్వేపల్లిలో అంతా దోపిడీ- కాకాణి"









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం, బ్రాహ్మణపల్లి, బిరుదువోలు గ్రామాల్లో పర్యటించిన మాజీ మంత్రివర్యులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. యూరియా అందలేదని కాకాణి ఎదుట వాపోయిన రైతులు. కొత్త పెన్షన్లు మంజూరు కాలేదంటూ ఆవేదన వ్యక్తం చేసిన మహిళలు. అనారోగ్యంతో మృతి చెందిన రావుల చిన అంకయ్య గౌడ్ పార్థవదేహానికి నివాళులర్పించి, ఇటీవల తండ్రిని కోల్పోయిన చిడదల వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన-కాకాణి. రైతులకు యూరియా అందించలేని అసమర్థ ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం. రైతులకు సకాలంలో యూరియా అందక, బ్లాక్ మార్కెట్లో 200 రూపాయలు అదనంగా చెల్లించి, యూరియా కొనుగోలు చేయడం దురదృష్టం. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు సమృద్ధిగా రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియా అందించాం. కూటమి ప్రభుత్వంలో కొంతమందికి మాత్రమే యూరియా ఇస్తూ, పక్షపాత ధోరణితో రైతులు తీవ్ర అవస్థల పాలవుతున్నారు. కొత్త పెన్షన్లు మంజూరు కాక, వితంతువులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. భర్తకు పెన్షన్ వస్తూ మరణిస్తే ,భార్యకు వితంతు పెన్షన్ మంజూరు చేస్తూ, వితంతూ పెన్షన్లు మంజూరు చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతుంది. వృద్ధాప్య పెన్షన్లు, వితంతు పెన్షన్లు, రాక ప్రజలు అనేక కష్టాల పాలవుతున్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతి ఆరు నెలలకొక సారి, కొత్త పెన్షన్లు మంజూరు చేసి, అందించే వాళ్ళం. సర్వేపల్లి నియోజకవర్గంలో దోపిడీ తప్ప, అభివృద్ధి కనిపించడం లేదు. సర్వేపల్లి నియోజకవర్గంలో అవినీతి ముందంజలో ఉంటే, అభివృద్ధి వెనకబడిపోయింది. సర్వేపల్లిలో సహజ వనరుల దగ్గర నుండి మొత్తం దోపిడీ తప్ప, ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. బెల్టు షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపట్టి మహిళల ఉసురు పోసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం 19 నెలల పాలనలో విసిగి, వేసారి పోయిన ప్రజలు జగన్మోహన్ రెడ్డి పాలన కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. అధికారం ఉన్నా, లేకపోయినా ఎళ్ళవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, అతిపెద్ద సేవకుడిగా సేవలందిస్తా.

# "పోలీస్ కేసులను ఎదుర్కొంటాం - కాకాణి"

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మాజీ మంత్రివర్యులు మరియు వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డిపై రెండు కేసులు నమోదు చేసి, నోటీసులు ఇవ్వడానికి వచ్చిన పొదలకూరు పోలీస్‌లు. పోలీస్‌ల రాకకు గల వివరాలు అడిగి తెలుసుకున్న కాకాణి. సోమిరెడ్డిని దుషించారంటు నమోదైన కేసులో నోటీసులు అందించేందుకు వచ్చామన్న పొదలకూరు పోలీస్‌లు. నమోదైన కేసు మీద విచారణకు ఈ రోజు సాయంత్రం 5 గంటలకు రావాలని కోరిన పోలీస్‌లు. కేసు నమోదు చేసేందుకు ఇచ్చిన పిర్యాదుతో సహా ఎఫ్ఐఆర్ కాపీ చూపాలని కోరిన - కాకాణి. మీరిచ్చే నోటీస్‌లలో ఏముందో తెలపాలన్న కాకాణి. పొదలకూరులో నిర్వహించిన సభలో మీ మీద కేసు కేసు నమోదు అయింది, విచారణకు హాజరు రావాలని తెలిపిన పోలీసులు. పొదలకూరులో అక్రమ లేఔట్లకు సంబంధించి నుడా వాళ్ళు పెట్టిన కేసు గురించి చర్యలు ఎందుకు తీసులేదని పోలీస్‌లను ప్రశ్నించిన కాకాణి.. నీళ్లు నమిలిన.. పోలీస్లు. సోమిరెడ్డితో సహా నేను చేసిన ఆరోపణలన్నీ వాస్తవాలే, ఆధారాలతో సహా నిరూపిస్తానన్న కాకాణి. నోటీసులు తీసుకొని ఈ రోజు సాయంత్రం 4 గంటల లోపల ఎఫ్ఐఆర్ కాపీ తీసుకొస్తే,నేను విచారణకు వస్తానని పోలీసులకు చెప్పిన కాకాణి. పోలీస్ల విచారణలో నేను ఎలాంటి ఆధారాలు తీసుకెళ్లాలో నాకు అర్థం కావడం లేదు. పోలీస్‌లకు ఏ వివరాలు కావాలి? సోమిరెడ్డి మీద ఇటీవల చాలా వ్యాఖ్యలు చేశాను విరువూరు ఇసుక రీచ్ లో స్కానర్ పెట్టి ఒక్కో వాహనానికి ఐదు రెట్లు వసూలు చేస్తున్నాడని చెప్పా, ఆధారాలతో సహా మీడియాకి చూపించా. సోమిరెడ్డి చిన్నప్పుడు చదువుకునే రోజుల్లో ఇంటర్వెల్ సమయంలో చిన్న పిల్లల దగ్గర పుస్తకాలు కాజేసి, అమ్మి శనగల బెల్లం తినేవాడని మాట్లాడాను దానికి సంబంధించా? వెంకటాచలం మండలం, గొలగమూడి రోడ్డులో సంత



నిర్వహించి నెలకి 5 లక్షలు వసూలు చేస్తున్నాడని చెప్పా, అక్కడికి వెళితే ఎవరికైనా ఆధారాలతో సహా నిరూపితమవుతుంది. సోమిరెడ్డి చేసిన దోపిడీలు సర్వే పల్లి నియోజకవర్గంలో చాలా ఉన్నాయ్, నాగంబొట్ల వారి కండ్రిగలో గ్రావెల్ దోపిడీ చేస్తున్నాడు.. దాని గురించా? ముత్తుకూరులో బంకర్ల వారి దగ్గర రౌడీలను పెట్టి ఒక్కో బంకర్‌కి 300ల రూపాయల చొప్పున 150 బంకర్లకు రోజుకి 45 వేలు వసూల్ చేస్తున్నాడు దాని గురించా? పని చెయ్యకుండానే ఇరిగేషన్‌లో దొంగ బిల్లులు పెట్టుకొని దోచేశాడు, సిబిఐ విచారణ చేయించమని చెప్పా.. సోమిరెడ్డి దానిమీద అనుకున్నాడా? జెన్కో రోడ్డు సమీపంలో ట్యాంకర్‌లో కల్తీ బయోడీజల్ తీసుకొచ్చి లీటర్‌కి 7 రూపాయలు కమిషన్ పెట్టుకున్నారు, అక్రమంగా విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని ట్యాంకర్‌ను పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లిన పోలీస్‌లు ఎవరూ పిర్యాదు చెయ్యలేదని వదిలేశారు.. దాని గురించా. సోమిరెడ్డి చేసిన అవినీతి మీద మాట్లాడాను, పోలీస్‌లు స్పష్టంగా చెబితే వాటి ఆధారాలు తీసుకొని పొదలకూరు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళడానికి నేను సిద్ధంగా ఉన్నా. పోలీస్‌లు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బయపడను, నువ్వు చేసే అవినీతిపై నిత్యం పోరాడుతూ ఉంటా నీ అవినీతిని ఎండకడుతా.

# పీఎంఎంఎస్‌వై కింద ఏపీకి అందిన నిధులెన్ని?

## - లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్న



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రధాన్‌మంత్రి మత్స్య సంపద యోజన కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ముఖ్యంగా నెల్లూరు జిల్లాకు అందిన నిధులు ఎన్నని, వాటి ద్వారా రాష్ట్రంలో, నెల్లూరులో చేపట్టిన ప్రాజెక్టు వివరాలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో కోరారు. ఈ మేరకు మంగళవారం పీఎంఎంఎస్‌వైపై పలు ప్రశ్నలు వేశారు. గత ఐదు సంవత్సరాల్లో ఏపీలో పీఎంఎంఎస్‌వై అమలుకు ఏదైనా సర్వే నిర్వహించిందా అని ఆరా తీశారు. పీఎంఎంఎస్‌వై ఏపీలో మత్స్యకారుల నైపుణ్యాభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాల వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ శాఖ మంత్రి రంజన్ సింగ్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్‌వై) కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ. 2416.92 కోట్ల విలువైన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందన్నారు. ఇందులో కేంద్ర వాటా రూ.569.86 కోట్లు కాగా నెల్లూరు జిల్లాతో సహా రాష్ట్రంలో వివిధ కార్యకలాపాల అమలు కోసం రూ. 482.55 కోట్లు విడుదల చేశామన్నారు. నెల్లూరు జిల్లాలో 288 కోట్లతో నీలి విప్లవం కింద చేపట్టిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తయ్యాయన్నారు. ఇక వాతావరణ మార్పులను తట్టుకునేలా తీరప్రాంత మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేయడానికి, కేంద్ర ప్రభుత్వం 100 గ్రామాలను ఎంపిక చేయగా.. నెల్లూరు జిల్లాలో తాటిచెట్ల పాలెం, లక్ష్మీనారాయణపురం, ఈదురుపాలెం గ్రామాలు ఉన్నాయన్నారు. ఇక ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద, మత్స్య, మరియు ఆక్వాకల్చర్ రంగంలో నైపుణ్యం కలిగిన వారిని అభివృద్ధి చేయడానికి, ఆంధ్రప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డిబి) ద్వారా శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ఎన్ఎఫ్‌డిబి నివేదికల ప్రకారం పీఎంఎంఎస్‌వై కింద రాష్ట్ర వ్యాప్తంగా 9570 మంది మత్స్యకారులు, చేపల రైతులను కవర్ చేస్తూ 218 శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడానికి వివిధ ఏజెన్సీలకు రూ. 254.341 లక్షలు విడుదల చేయబడ్డాయని వివరించారు. తీరప్రాంత జిల్లాల్లో సముద్రపు పాచి పెంపకంపై 2180 మంది మహిళా లబ్ధిదారులకు శిక్షణ అందించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందన్నారు.

# ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం : ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**మామిడికుదురు, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతీస్తున్నామని పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, ఆదుర్రు గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఘనంగా నిర్వహించిన ఈ శంకుస్థాపన కార్యక్రమాలలో మొదటగా ఎమ్మెల్యే ఆదుర్రు గ్రామంలో రూ.9 లక్షలు మరియు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించబోయే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.36 లక్షల వ్యయంతో నిర్మించబోయే ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.6.85 కోట్ల రూపాయల వ్యయంతో లూటుకుర్రు మరియు ఆదుర్రు గ్రామాలలో వైనతేయ కుడి ఏటిగట్టుపై గల వాడబోది మరియు బచ్చలబంద అవుట్ ఫాల్ స్లూయిస్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈరోజు ఒక్క ఆదుర్ గ్రామంలోనే సుమారు రూ.7.40 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహామాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఘనంగా బలరామ నాయుడు జన్మదిన వేడుకలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 203 గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు 69వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ జన్మదిన కార్యక్రమంలో 203 జిల్లా మొదటి మహిళా పద్మావతి పాల్గొనడం జరిగింది సభ్యులు ప్రతి ఒక్కరూ సేవాగుణంతో పనిచేస్తే ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందని ఉద్ఘాటించారు. నలుబోలు బలరామయ్య నాయుడు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి వివరించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఏసిఎస్ వాకర్స్ అసోసియేషన్ ఈవినింగ్ వాకర్స్ అసోసియేషన్, స్మైల్ వాకర్స్, ఏసి మహిళా వాకర్స్, సభ్యులు పాల్గొని బలరామయ్య నాయుడుని సన్మానించడమైనది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు షేక్ నసీర్ అహమద్ కార్యదర్శి శానంపూడి సుబ్బరాయుడు కోశాధికారి సితారి రత్నయ్య గౌరాధ్యక్షులు బిరదవోలు రామ్మోహన్ రెడ్డి, మాగంటి ప్రసాద్ నాయుడు, బెల్లం చెంచయ్య నాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, జివి కృష్ణయ్య, పత్తిపాటి రమణయ్య, కాగోళ్ళు శివయ్య, కంచర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ సత్యనారాయణ, యు గోవర్ధన్, జి వెంకటేశ్వర్లు నాయుడు, డి వెంకట్ రాజు, బి మారుతీరావు, వినుకొండ సోను, బి సదానంద రెడ్డి, వి ఆదినారాయణరెడ్డి, ఎం.మన్మోహన్, మొదలగువారు పాల్గొని కార్యక్రమమును జయప్రదం చేసారు.

# తిరుమల వెంకన్న భక్తులకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి : గన్నవరపు శ్రీనివాసరావు





**పి.గన్నవరం, (రాజధాని వార్తలు):** తిరుమల లడ్డూలలో జంతువుల కొవ్వు కలిసిందని అసత్య ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి భక్తులకు క్షమాపణ చెప్పాలని పి.గన్నవరం వైసీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తిరుమల లడ్డుపై కూటమినేతలు అసత్య ఆరోపణలు చేయడమే కాకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్ట దిగజార్చే విధంగా ఫ్లెక్సీలు పోస్టర్లు వేశారని మంగళవారం పోలీసులకు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి మరియు కూటమినేతలు చేస్తున్న అబద్ధపు ఆరోపణల పైన, మరియు ఎవరి పేరు, ప్రింటింగ్ సంస్థ పేరు లేకుండా ఆయా ప్రదేశాలలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన బాధ్యులపై, మరియు కూటమి నేతల చేస్తున్న గూండాగిరి చేష్టలకు తగిన చర్యలు తీసుకోవాలని వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పి.గన్నవరం పోలీస్ స్టేషన్లో ఎస్సై శివకృష్ణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం గన్నవరపు శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి లోకేష్ తిరుమల లడ్డూల్లో కలుషితమైన కొవ్వులు వాడారని ప్రజలను మరియు శ్రీవారి భక్తులను తప్పుదోవ పట్టించారని, దర్యాప్తు సంస్థలు కోర్టుకు సమర్పించిన చార్జ్ షీట్‌లో జంతువుల కొవ్వు కలవలేదని నిర్ధారించిన నేపథ్యంలో ఆక్రోషం తట్టుకోలేక పోతున్న కూటమి నేతలు వైసిపి నేతల ఇండ్లపై దాడులు చేసి తగలబెడుతున్నారని, అక్రమ అరెస్టులు చేస్తూ రాక్షసకాండ సృష్టిస్తున్నారని తెలిపారు. సంపద సృష్టించి సంక్షేమం చేస్తానని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని మహిళలను మోసం చేశారని 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు 1500 రూపాయలు నెలనెలా ఇస్తానని అబద్ధాలు చెప్పారని అలాగే కాపు మహిళలకు చేయూతనిస్తానని మోసం చేశారని ఇలాంటివన్నీ ప్రశ్నిస్తారని తెలిసి వైసీపీ నేతలపై దాడులకు తెగబడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి బదులు రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఎద్దేవా చేశారు. దేశంలోనే వివిధ పీఠాధిపతులకు ప్రపంచంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు విద్యాశాఖ మంత్రి లోకేష్ క్షమాపణలు తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఇసి సభ్యురాలు శ్రీమతి పాముల రాజేశ్వరి దేవి మందపాటి కిరణ్ కుమార్ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు ఎన్నాబత్తుల ఆనంద్, విత్తనాల ఇంద్రశేఖర్, మేడిశెట్టి శ్రీనివాసరావు, కొమ్ముల రాము, జెడ్పిటిసిలు, ఎంపీపీలు, తాజా మాజీ సర్పంచ్ లు, ఇతర వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మసేనుకు ఘన సత్కారం

**కొత్త పేట, (రాజధాని వార్తలు):** కొత్తపేట మండలం గంటి జడ్పీ హైస్కూల్లో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న నేలపూడి మసేను ను తోటి ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. మసేను ఇటీవల గద్దర్ జాతీయ సేవా పురస్కారం అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హెచ్ఎం. అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మసేను ను దుస్సాలువ పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, కెజిఎన్., జి.ఇందిర, ప్రతాప్ కుమార్, భాస్కర రావు, కోరుకొండ శ్రీకాంత్ శర్మ, అయ్యప్ప, ఫణి శేఖర్, ఎస్. శేషారావు పాల్గొన్నారు.



# ఘనంగా లక్కింశెట్టి భాస్కర్ పుట్టినరోజు వేడుకలు



**అంబాజీపేట, (రాజధాని వార్తలు):** అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన ప్రముఖ వీవర్స్ నాయకులు లక్కింశెట్టి భాస్కర్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం జి ఎస్ వి ప్రసాద్ గృహం నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన పెద్దలు వివిధ పార్టీల రాజకీయ నాయకులు, స్నేహితులు కేక్ కోసి దుస్సాలువాతో భాస్కర్‌ను సత్కరించి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుల్లేటికుర్రు గ్రామ సర్పంచ్ చెల్లి బాలరాజు, ఉపసర్పంచ్ వీరా రవి, జి ఎస్ వి ప్రసాద్, మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న, వార్డ్ మెంబర్ కత్తుల బాలస్వామి, జంగా పల్లేశ్వరరావు, నెల్లి స్టాలిన్, రాజీవ్ వినోద్ అనిల్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan